

వెక్కిరిస్తున్న తొలి సంతకం

అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైలు ఫైనే తొలి సంతకం చేసిన చంద్రబాబు.. నేటి వరకూ నోటిఫికేషన్ మాత్రం జారీ చేయలేదు.


8లో



వెండి పాదుకల సమర్పణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారికి గ్రామానికి చెందిన తటవర్తి మోహన్, వాణి దంపతులు రూ.52 వేల విలువైన 475 గ్రాముల వెండి పాదుకలు సమర్పించారు.

డెల్టాలకు 12,040 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 12,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన అంతర్వేది



అంతర్వేది లక్ష్మీనృసింహుని క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని క్షేత్రం మంగళ, బుధవారాలలో సంక్రాంతి, కనుమ పర్వదినాలు పురస్కరించుకుని భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రాంగణం ఎటు చూసినా భక్తులతో రద్దీగా మారింది. ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలోను, విశేష అభిషేకంలోను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల క్యూలను, అన్నదాన పథకాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు అస్తవ్యస్తం

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను కూటమి ప్రభుత్వం అస్తవ్యస్తం చేస్తోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వలంటీర్ల కొనసాగింపుపై హామీ ఇవ్వకుండా, సచివాలయ ఉద్యోగుల విభజన, విధి విధానాలు గందరగోళంగా మార్చిందని పేర్కొన్నారు. మూడంచెలుగా సచివాలయ ఉద్యోగులను విభజించాలన్న సచివాలయ ఉద్యోగుల సమాఖ్య ప్రతిపాదనపై ఉద్యోగ సంఘాల నాయకులతో కూలంకషంగా చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

20 నుంచి ఇంటర్ ప్రీ పబ్లిక్

రాయవరం: ఇంటర్మీడియేట్ ప్రీ పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. 2024–25 విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన ఇవి ప్రారంభం కానున్నాయి. జనరల్ కోర్సుల పరీక్షలు జనవరి 20 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెకండియర్ పరీక్షలను నిర్వహించనున్నారు. విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

ఇంటర్‌బోర్డు ప్రశ్న పత్రంతో..

2023–24 ఇంటర్ పబ్లిక్ పరీక్షలు గత ఏడాది మార్చి నెలలో, సప్లిమెంటరీ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది మార్చి నెలలో ఇచ్చిన మూడు సెట్లలో రెండింటిని మార్చి, జూన్ పరీక్షల్లో వినియోగించగా.. ఒక సెట్ మిగిలింది. మిగిలిన ఆ ఒక సెట్ ప్రశ్న పత్రాన్ని ఈ ప్రీ పబ్లిక్ పరీక్షలకు వినియోగించాలని ఇంటర్మీడియేట్ విద్య కమిషనర్ కృత్తికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియేట్ విద్య డీఐఈఓ వనుము సోమశేఖరరావు ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 13 ప్రభుత్వ కళాశాలల్లో ఫస్టియర్ 1,069 మంది, ఒకేషనల్ 313, సెకండియర్ 852, ఒకేషనల్ 280 మంది ఉన్నారు. 20న సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లిష్, 22న గణితం–1ఎ, బోటనీ, సివిక్స్, 23న గణితం పేపర్–1బి, జువాలజీ, హిస్టరీ, 24న ఫిజిక్స్, ఎకనామిక్స్, 25న కెమిస్ట్రీ, కామర్స్ పేపర్లు నిర్వహిస్తారు.

ప్రభలసీమ

- జిల్లాలో పలుచోట్ల ప్రభల తీర్థాలు
- దారులన్నీ జగ్గన్నతోట వైపే
- పోటెత్తిన భక్తజనం
- లోకకల్యాణార్థం కొలువుతీరిన ఏకాదశ రుద్రులు
- కొత్తపేట... కొర్లగుంటలలో సైతం జనం బారులు



పి.గన్నవరం మండలం కుందాలపల్లిలో ప్రభను పంట కాలువ దాటిస్తున్న దృశ్యం



జగన్నతోట తీర్థానికి కాలువ దాటి వస్తున్న గంగలకుర్రు అగ్రహారం ప్రభ

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట/కొత్తపేట: అందమైన పూదోటల్లో.. మరింత అందమైన రంగురంగుల సీతాకోక చిలుకలు విహరించినట్టుగా పైరు పచ్చని కోనసీమలో రంగురంగుల ప్రభలు విహరించాయి. పచ్చని వరిచేలు.. కొబ్బరితోటల మధ్య నుంచి... గలగల పారే పంట, మురుగునీటి కాలువలను దాటుకుంటూ సందడి చేశాయి. రంగురంగుల కంకర్లు.. అందమైన అల్లికలు.. జే గంటలు.. పసిడి కంకులతో తయారు చేసిన ధాన్యం కుచ్చులు.. భారీ గజమాలలు.. గుమ్మడికాయలు.. నెత్తిన నెమలిపింఛాలతో ముగ్ధమనోహరమైన ప్రభలను చూసేందుకు రెండు కళ్లు చాలవంటే అతిశయోక్తి కాదు. కోనసీమలో జగ్గన్నతోటతో పాటు పలుచోట్ల మంగళ, బుధవారాల్లో జరిగిన తీర్థాలకు జనం పోటెత్తారు.

వ్యాఘ్రేశ్వరస్వామి అధ్యక్షతన..

నింగిలోని ఇంద్రధనస్సు నేలకొచ్చివాలిందా అన్నట్టు జగ్గన్నతోటలో పరమేశ్వరుని పదకొండు రూపాలు భక్తుల కళ్లముందు దర్శనమిచ్చాయి. మొసలపల్లి భోగేశ్వరస్వామి ఆహ్వానం మేరకు గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నకేశవ మల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనకేశ్వరస్వామి, ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి, వక్కలంక కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి జగ్గన్నతోటలో సమావేశమై లోక కల్యాణార్థం చర్చలు జరుపుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సమావేశానికి అధ్యక్షత వహించే వ్యాఘ్రేశ్వరస్వామి ప్రభ వచ్చిన సమయంలో మిగిలిన ప్రభలను గౌరవ సూచకంగా ఒకసారి పైకి ఎత్తిదించారు.

అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోట ప్రభల తీర్థానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానికులే కాకుండా వివిధ రాష్ట్రాలు, దేశాలకు ఉపాధి కోసం వెళ్లినవారు తీర్థానికి కుటుంబ సమేతంగా వచ్చారు. తీర్థానికి సుమారు లక్ష మంది హాజరైనట్టు అంచనా. ఒక వైపు ప్రభల మోసే భక్తుల ఓంకార నాదాలు.. ప్రభలకు వేలాడదీసిన జేగంటల శబ్దాలు.. ప్రభల మోసేవారి అశ్వరభ.. శరభ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది. తీర్థం జరిగిన జగ్గన్నతోటకు రెండు కిలోమీటర్ల మేర భక్తజన సవ్వడి వినిపించింది. మధ్యాహ్నం 12 గంటల సమయానికే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. 2.30 గంటల సమయంలో గంగలకుర్రు, ఆ తరువాత గంగలకుర్రు అగ్రహారం ప్రభలు మురుగునీటి కాలువ (కౌశిక) దాటుతున్న సమయంలో వేలాదిగా జనం మురుగునీటి కాలువ, వంతెనల మీదకు చేరుకున్నారు. ప్రభలు కౌశికదాటే సన్నివేశాన్ని ఆసక్తిగా తిలకించారు. తీర్థాలకు సంప్రదాయ వస్త్రధారణలతో యువతులు ప్రభల అందాలతో పోటీ పడ్డారు. వృద్ధులు, యువకులు, మహిళలు అనే తేడా లేకుండా తీర్థానికి వచ్చారు. కొన్ని కుటుంబాల వారు గూడు ఎడ్లబండ్లపై తీర్థానికి రావడం పలువురిని ఆకట్టుకుంది. ఇదే మండలంలో వాకలగరువు సరిహద్దులో జరిగిన ప్రభల తీర్థంలో వాకలగరువు 53 అడుగులు, తొండవరం 55 అడుగుల ఎత్తున ప్రభలు భక్తులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు వీటి వద్ద ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు.

కొత్తపేటలో బాణసంచా కాల్పులు

కొత్తపేటలో సంక్రాంతి రోజు మంగళవారం తెల్లవారు జాము నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు ప్రభల తీర్థం అంగరంగ వైభవంగా జరిగింది. సుమారు 24 గంటల పాటు జరిగిన ఈ తీర్థానికి సైతం పెద్ద ఎత్తున జనం వచ్చారు. పాత, కొత్త రామాలయం వీధుల వారు ఒకరి తరువాత ఒకరు ప్రభలను ఊరేగించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకూ కాలేజ్ గ్రౌండ్‌లో, అనంతరం ప్రభల తిరుగు ఊరేగింపులో భాగంగా అర్ధరాత్రి 2 గంటల నుంచి బుధవారం ఉదయం 5.30 గంటల వరకూ పాత బస్టాండ్ సెంటర్‌లో బాణసంచా కాల్పుల మోత హోరెత్తింది. ఇదే మండలంలో మందపల్లి, అవిడి డ్యామ్‌సెంటరు, వాడపాలెం, రావులపాలెం మండలం దేవరపల్లిలో కూడా ప్రభల తీర్థాలు జరిగాయి.

కొర్లగుంటకు 12 ప్రభలు

మామిడికుదురు మండలం కొర్లగుంటలో జరిగిన తీర్థంలో 12 ప్రభలు కొలువుదీరాయి. ప్రభలు పంటచేలు, కాలువలు దాటుకుని వచ్చాయి. కొత్తపేట మండలం అవిడి, పి.గన్నవరం మండలం మానేపల్లి, నాగుల్లంక, పప్పులవారిపాలెం, అయినవిల్లి, అమలాపురం మండలం సాకుర్రు గరువు, బండారులంక, అమలాపురంలో గనికమ్మగుడి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మలికిపురం మండలం కేశనపల్లి, తూర్పుపాలెం, రాజోలు పాదలాడ, ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, క్రాప చింతలపూడి, కాట్రేనికోన మండలం చెయ్యేరు, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవిల్లో ప్రభలు తీర్థాలు సాగాయి.

ఏకాదశ రుద్రుల దర్శనం మహా భాగ్యం



అబుదాబిలో లెక్చరర్‌గా పని చేస్తున్నాను. ఏకాదశ రుద్రులను దర్శించుకోవడానికి ప్రత్యేకంగా అబుదాబి నుంచి వచ్చా. 2023 గణతంత్ర వేడుకల్లో ఏకాదశ రుద్రుల శకటాన్ని ప్రదర్శించడంతో అబుదాబిలో ప్రత్యక్ష ప్రసారంలో చూశా. అప్పటి నుంచి నేరుగా ఏకాదశ రుద్రులను దర్శించుకోవాలన్న కోరికను భగవంతుడు ఇప్పుడు తీర్చాడు.

– నూకల శ్యామ్ సుందర్, అబుదాబి

36 ఏళ్ల తర్వాత వచ్చాను



ప్రభల తీర్థాన్ని చూసేందుకు 36 ఏళ్ల తర్వాత అమెరికా నుంచి వచ్చాను. ఇండియానా రాష్ట్రంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. తొండవరం, వాకల గరువులలో తీర్థాలకు కూడా వెళ్లాం. జగన్నతోట ప్రభల తీర్థం ఎంతో ప్రాధాన్యం ఉన్నది కావడంతో ఏకాదశ రుద్రులను దర్శించుకోవడం ఆనందంగా ఉంది.

– సత్య భమిడిపాటి, అమెరికా

ఏటా క్రమం తప్పకుండా..



మాది తెలంగాణ. కోనసీమ కోడలిని. చినప్పుడు నుంచి బతుకమ్మను ఎంత ఆసక్తిగా.. అద్భుతంగా చూస్తామో.. పెళ్లి అయిన తరువాత నుంచి ప్రభల తీర్థాలను అంతగా ఆసక్తిగా చూస్తున్నాను. ఏటా క్రమం తప్పకుండా కుటుంబ సభ్యులతో కలిసి ప్రభల తీర్థానికి వస్తుంటాను.

– బి. సుధా చందన, హైదరాబాద్

ఆస్ట్రేలియా నుంచి వచ్చా



ఆస్ట్రేలియాలోని ఒక పాఠశాలలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. ఐదేళ్ల క్రితం ప్రభల తీర్థానికి వచ్చా. తిరిగి ఇప్పుడు వచ్చాం. ఆస్ట్రేలియాలో ఉన్న తెలుగు కుటుంబాలకు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెప్పేందుకు దసరా ఉత్సవాలను నిర్వహించడం, లలితా సహస్ర నామ పారాయణతో పాటు ఆయా కుటుంబాల చిన్నారులకు బాల వికాస్ తరగతులను నిర్వహిస్తున్నాం.

– దువ్వూరి రాజ్యలక్ష్మి, గంగలకుర్రు, అంబాజీపేట మండలం



అంబాజీపేట మండలం జగ్గన్నతోటకు ఊరేగింపుగా వస్తున్న ప్రభలు



అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో భక్త జన సంద్రం

కాసులు కురిపించిన కోసలు

- వీరమరణం పొందిన కోడికి భలే డిమాండ్
- రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు గిరాకీ
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడానికి కానుకగా కోసలు



పోటాపోటీగా తలపడుతున్న పందెం కోళ్లు

అల్లవరం: సంక్రాంతి పండగకు నిర్వహించే కోడి పందేలకు ఎంత క్రేజు ఉంటుందో అదే స్థాయిలో పందెం బరిలో వీర మరణం పొందిన పుంజు (కోస)కు అంతే క్రేజు ఉంటుంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోస గురించి తెలియని వారు ఉండరు. పందెంలో పోరాడి చనిపోయిన కోసని వేలాది రుపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తుంటారు. బరువును బట్టి రూ.3 వేల నుంచి రూ. 10 వేలు వరకు కోసల కోసం వెచ్చిస్తారు. ఇష్టమైన వారికి, బంధువులకు, స్నేహితులకు తమ హోదాని వారికి తెలియచెప్పేందుకు రూ.వేలల్లో ఖర్చు చేసి కోసని బహుమతిగా ఇస్తుంటారు. పందెం జరుగుతున్న సమయంలో బరుల వద్ద కోసల కోసం మాంసప్రియులు ఎగబడతారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఆగస్టు నెలల్లో లభించే పులస చేపకు ఎంత ప్రత్యేకత ఉందో ఆదే స్థాయిలో 'కోస'కి కూడా ఉంది. కోస రుచికి ఎవరైనా ముగ్ధులు కావల్సిందే. అయితే కోడి పుంజులన్నీ కోసలు కాదు. పందెం బరిలో ప్రత్యర్థితో పోరాడుతూ మృతిచెందిన కోడే కోసగా పరిగణిస్తారు. పందెం కోళ్లకు రెండు నెలల ముందు నుంచే బరిలో ఎలా పోరాడాలో తర్ఫీదు ఇస్తారు. వేడి నీళ్లల్లో ఈత కొట్టిస్తారు. వ్యాయమాలు చేయిస్తారు. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి ఆహారాన్ని అందిస్తారు. కోడి పందెం జరుగుతున్న సమయాల్లో ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడానికి కోసలకై ఎగబడతారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ యంత్రాంగం మాత్రం పందెం బరుల్లో నిర్వాహకుల నుంచి కోసలను పొందుతుంటారు.

బరిలో.. నవల ఆవిష్కరణ



బరిలో నవలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దాట్ల

యానాం: యానాంకు చెందిన ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు రచించిన బరిలో.. నవల పుస్తకాన్ని బుధవారం ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు ఆవిష్కరించారు. పురాణ, చారిత్రక, సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణంలో కోడిపందేల నేపథ్యంలో రాసిన తొలి తెలుగు నవల బరిలో పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం రచయిత దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ కోడిపందేల ఇతివృత్తం తెలుగు సాహిత్యంలో నమోదు కాలేదని, తాను విషయ సేకరణచేసి రాసిన నవల అని తెలిపారు. మాజీ ఎంపీపీ మందాల గంగసూర్యనారాయణ, చింతా వెంకట్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా అశ్లీల నృత్యాలు

- యథేచ్ఛగా గుండాట, పేకాట శిబిరాలు
- పాలగుమ్మిలో ఇరువర్గాల ఘర్షణ



గోగన్నమఠంలో అశ్లీల నృత్యాలు

రాజోలు: సంప్రదాయంగా నిర్వహించుకునే సంక్రాంతి పండగ రాజోలు నియోజకవర్గంలో అశ్లీల నృత్యాలకు కేంద్రం బిందువుగా మారింది. సంక్రాంతి వేడుకల ముసుగులో అధికార కూటమి నేతలు బరి తెగించి కోడి పందేలు, గుండాట, పేకాట శిబిరాలు పోటాపోటీగా నిర్వహించి అసాంఘిక కార్యక్రమాలను విచ్చలవిడిగా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధి అసాంఘిక కార్యక్రమాలకు అనధికారికంగా అనుమతులు ఇవ్వడంతో రాజోలు పోలీసులు చేతులెత్తేశారు. రాజోలు మండలం పాలగుమ్మి గ్రామంలో కోడి పందేల వద్ద చోటుచేసుకున్న విభేదాలు ఇరు వర్గాల మధ్య ఘర్షణలకు దారితీశాయి. రాజోలులో కూటమి నేతలకు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి మధ్య వైరం ముదిరి వేర్వేరు కోడిపందేలు, పేకాట, గుండాట శిబిరాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మధ్యవర్తిత్వంలో సాగునీటి పంపిణీ సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి ఇంటి వద్ద పంచాయితీ జరిగింది. ఆ పంచాయితీలో వాటాలు తెగకపోవడంతో మరో మారు ఎమ్మెల్యే వరప్రసాద్ ఇంటి వద్ద రేవు జ్యోతి, చెల్లుబోయిన రాంబాబు, ఇద్దరు టీవీ విలేకర్లు తమకు కోడి పందేలు నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలంటూ ఎమ్మెల్యేను నిలదీసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. యువతకు ఉపాధి కల్పిస్తానని చెప్పిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అసాంఘిక కార్యక్రమాలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి యువతను పెడదోవ పెడుతున్నారని, పోలీసులకు అందిన ముడుపులపై ఆధారాలతో నిరూపిస్తానని జనసేన నాయకుడు యెనుముల వెంకటపతిరాజు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మగటపల్లిలో అశ్లీల నృత్యాలను ఆపేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్‌ను స్టేజ్‌పై నుంచి నెట్టివేశారు. కాట్రేనిపాడు, పొన్నమండ, మామిడికుదురు మండలం కరవాక, గోగన్నమఠం, మలికిపురం మండలం కేశనపల్లి, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలో అంతర్వేది, టేకిశెట్టిపాలెం తదితర ప్రాంతాల్లో అశ్లీల నృత్యాలు నిర్వహించారు.

హద్దులు మీరిన డ్యాన్స్‌లు

మామిడికుదురు మండలం గోగన్నమఠం, మలికిపురం మండలం కేశనపల్లి, జిల్లా కేంద్రం అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా అశ్లీల నృత్యాలు (రికార్డింగ్ డ్యాన్స్‌లు) హద్దులు మీరి మరీ నిర్వహించారు. ఆ డ్యాన్స్‌లో కొందరు మహిళా కళాకారులు అశ్లీలతను మోతాదుని మించి ప్రదర్శించినా పోలీసులు పట్టించుకోలేదు. సాధారణ సమయంలో పేకాట, గుండాట, కోడి పందెం ఎక్కడ జరిగినా తక్షణమే దాడులు చేసి కేసులు నమోదుతోపాటు అరెస్టులు చేసే పోలీసులు సంక్రాంతి వేళ పత్తా లేకుండా పోవడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

పోలీజుల సాక్షిగా పందేలు



పందేనికి సిద్ధమవుతున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



కోడి పందేలు చూస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు



వీఐపీ గ్యాలరీలో కూర్చుని పందేలు వీక్షిస్తున్న మహిళలు



పందేనికి సై అంటున్న సినీనటి హేమ



కోడిపందేల బరిలో పార్కింగ్ చేసిన కార్లు

- జిల్లాలో జోరుగా కోడిపందేలు
- మురమళ్ల బరిలో పందేలను వీక్షించిన ఎంపీలు, ఎమ్మెల్యే
- 3 పండుగలు... రూ.300 కోట్ల మేర పందేలు



మురమళ్లలో స్టేడియంలో ఎల్ఈడి స్క్రీన్లపై కోడి పందేలు, గ్యాలరీలలో వీక్షిస్తున్న ప్రజలు

అమలాపురం టౌన్: సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగిపోయాయి. జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల పరోక్ష ఆదేశాలతో పోలీసులు చేతులు ఎత్తేయడంతో పందేలు బరి తెగించి సాగాయి. సంక్రాంతి సంగ్రామంలో పందెం కోడి గెలిస్తే... వాటిని అదుపు చేయాల్సిన పోలీసులు ఓడిపోయారన్న విమర్శ జిల్లాలో కోడై కోసింది. పందేల కోళ్ల రూ.కోట్లు కొల్లగొడుతున్నా, వేలాది మంది జనం ఒకే చోట గుమిగూడి కోడి,గుండాట పందేలు ఆడేస్తున్నా, అశ్లీల నృత్యాలు హద్దులు మీరి మరీ ప్రదర్శిస్తున్నా ఆయా ప్రాంతాల వైపు పోలీసు అధికారులు కనీసం చూడలేదు. అదుపు చేయాలన్న ఊసే లేదు. పోలీసులు సంక్రాంతికి ముందు కోడి పందేలపై ఉక్కుపాదం మోపుతామన్న హెచ్చరికలు ఉత్తి ప్రకటనలే అయ్యాయి.

మురమళ్లకి ప్రత్యేకత

జిల్లాలో సంక్రాంతి సంప్రదాయం పేరుతో దాదాపు 110 కోడి పందేల బరులు వెలిశాయి. ఇందులో ఐ.పోలవరం మండలం మురమళ్ల బరి హైటెక్ హంగులతో రూపుదిద్దుకుంది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఈ బరిని ఉభయ గోదావరి జిల్లాల పందేల ప్రియులను ఆకర్షించే రీతిలో ప్రత్యేకంగా తయారు చేయించి మరీ తానే అన్నీ అయి ఆడించారు. క్రికెట్ స్టేడియంలో గ్యాలరీ మాదిరిగా ప్రేక్షకులు కూర్చునే ఏర్పాట్లు, పందేలను ఏ వైపు నుంచైనా సునాయాసంగా వీక్షించేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. పండగల కోసం స్వగ్రామాలకు హైదరాబాద్ నుంచి కార్లలో వచ్చి మరీ ఈ బరిలో పందేలును వీక్షించారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు మూడు రోజుల నుంచి బరిలో దగ్గరుండి మీరీ పందేలను పర్యవేక్షిస్తూ వీక్షిస్తుంటే కనుమ పండుగ రోజున రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్ మాథూర్, టి. ఉదయ శ్రీనివాస్, సినీనటి హేమ కూడా వీక్షించారు. ప్రతీ నియోజకవర్గంలో 10 నుంచి 20 బరులు ఏర్పాటైతే అమలాపురం నియోజకవర్గంలో మాత్రం 25 గ్రామాల్లో 30 బరులు ఏర్పాటయ్యాయి. కొత్తపేట, మండపేట, రాజోలు, పి.గన్నవరం, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని బరుల్లో పందేలరాయుళ్లు చెలరేగి మరీ కోడి పందేలను ఆడించారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ పందేలు కాశారు. మురమళ్ల బరిలో అయితే రూ.5 లక్షల నుంచి పందేలు మొదలై ఆపైనే సాగాయి. సంక్రాంతి 3 పండుగల్లో ఒక్క మురమళ్ల బరిలో రూ.60 కోట్ల మేర పందేలు సాగితే అదే జిల్లాలో రూ.300 కోట్ల మేర నిర్వహించారు. జిల్లా పోలీసులు మాత్రం సంక్రాంతికి కొన్ని బరులను ధ్వంసం చేసినట్లు, కొన్ని కోళ్లను, కొంత నగదును, కోడి కత్తులను సీజ్ చేసినట్లు ప్రకటించినా పూర్తి స్థాయిలో నిఘా లోపించడంతో కోడి పందేలు, గుండాటలు, అశ్లీల నృత్యాలు అదుపు తప్పి అడ్డగోలుగా జరిగాయి.



మురమళ్ల కోడి పందేల ప్రదేశంలో ఫోన్‌పే చేస్తే నగదు ఇచ్చే మొబైల్ క్యాష్ కౌంటర్

82 కేసుల నమోదు

- 180 మంది అరెస్ట్
- ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: సంక్రాంతి పండగల సందర్భంగా కోడిపందేలపై ఒక్క భోగి రోజునే జిల్లావ్యాప్తంగా దాడులు చేసి 82 కేసులు నమోదు చేయడంతో పాటు 180 మందిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు అమలాపురంలో ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. కోడిపందేలపై 82 కేసులతోపాటు 156 కోళ్లను, 186 కోళ్ల కత్తులను, రూ.83,241 నగదును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. కోడికత్తులు కట్టే వారిని, పందేలు నిర్వహించే వారిని, గుండాట ఆడేవారిని, అనుమానితులను గుర్తించి మొత్తం 1,286 మందిని బైండోవర్ చేశామని వివరించారు. జిల్లాలో పేకాట ఆడుతున్న బృందాలపై దాడులు చేసి భోగి పండగ ఒక్క రోజే 44 కేసులు నమోదు చేసి 100 మందిని అరెస్ట్ చేశామన్నారు. ఆరు ఆటోలు, రూ.52,730 నగదును సీజ్ చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను నియమించి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపైన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపైన, అల్లర్లు చేసే వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. మకర సంక్రాంతి, కనుమ పండగల్లో నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కూడా కేసులు నమోదు చేసి చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ కృష్ణారావు వివరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వెక్కిరిస్తున్న తొలి సంతకం

- డీఎస్సీ నోటిఫికేషన్‌కు తప్పని ఎదురుచూపులు
- కోచింగ్‌లకు రూ.లక్షలు వెచ్చిస్తున్న వైనం
- జిల్లాలో 60వేల మంది బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు



రాయవరం: ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులంతా ఎప్పుడెప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. మేము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైలు పైనే తొలి సంతకం అని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఫైలుపై సంతకం చేశారు. అయితే నేటి వరకు నోటిఫికేషన్ మాత్రం జారీ చేయలేదు. ప్రభుత్వం నుంచి రోజుకో ప్రకటనతో అభ్యర్థుల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. ఏవేవో సాకులు చూపుతూ నోటిఫికేషన్‌ను జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు అభ్యర్థుల నుంచి విన్పిస్తున్నాయి. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక రాగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ కొత్త రాగం అందుకున్నారు. మరోపక్క అభ్యర్థులు కోచింగ్ సెంటర్ల బాట పట్టి..డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా..అంటూ ఎదురుచూపులు చూస్తున్నారు.

వాయిదాలపై వాయిదాలు

డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని ఎదురు చూసిన ప్రతి సారీ ఏదో ఒక సాకు చెప్పి ప్రభుత్వం వాయిదా వేస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ మరోసారి నిర్వహించి, ఆపై డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని తొలుతగా ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చింది. టెట్‌ను నిర్వహించి, నెలలు గడిచాయి. అనంతరం డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి, అడ్డంకులు తొలగించి నోటిఫికేషన్ ఇస్తామంటూ వాయిదా వేశారు. ఇప్పుడు తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చాక నోటిఫికేషన్ అంటూ మెలిక పెట్టారంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వాయిదాలు వేసుకుంటూ పోతే వయసు మీరి, అవకాశాన్ని కోల్పోతామని కొందరు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోచింగ్ బాట పట్టిన అభ్యర్థులు

డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల మంది వరకు వేచి చూస్తున్నట్టు అంచనా. ఇప్పటికే పలువురు ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై ఆశతో వేలాది మంది అభ్యర్థులు వారు చేస్తున్న ఉద్యోగాలను వదిలి, మరోపక్క అప్పులు చేసి మరీ కోచింగ్‌ల బాట పట్టారు. టీచర్ కొలువు సాధించాలనే లక్ష్యంతో వేలాది మంది కోచింగ్ సెంటర్లలో చేరారు. వారు చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాన్ని వదిలి, కుటుంబాలకు దూరమై కోచింగ్ సెంటర్ల వైపు పరుగులు తీశారు. ఉన్న ఉద్యోగాన్ని వదలడంతో జీతం నష్టపోవడమే కాకుండా, మరోపక్క కోచింగ్‌కు వేలాది రూపాయలు వెచ్చించి ఆర్థికంగా నష్టపోతున్నారు.మరోపక్క కోచింగ్ సెంటర్లకు కాసుల పంట పండినట్టయింది.

టెట్‌కు 30వేల మంది హాజరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతేడాది అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు టీచర్ ఎలిజబిలిటీ పరీక్ష (టెట్)ను జిల్లాల వారీగా నిర్వహించారు. ఈ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపుగా 30వేల మంది హాజరయ్యారు. రెట్టింపు సంఖ్యలో బీఎడ్, డీఎడ్ శిక్షణ పొందిన అభ్యర్థులు ఉన్నప్పటికీ 30వేల మంది వరకు టెట్ రాశారు. గతంలో టెట్ రాసిన వారు, తాజాగా టెట్ రాసిన అభ్యర్థులంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

టీచర్ పోస్టులపై కానరాని స్పష్టత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ కొలువులు ఎన్ని అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఉపాధ్యాయ ఖాళీలపై ప్రభుత్వం క్షేత్ర స్థాయి నుంచి నివేదిక కోరింది. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,146 వరకు ఖాళీలున్నట్టు సమాచారం. క్షేత్ర స్థాయిలో ఉన్న ఖాళీలను లెక్కించి, ఆర్థిక శాఖ అనుమతితో డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య ప్రకటించే అవకాశముంటుంది.

నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా



డీఎడ్ పూర్తి చేశాను. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాను. గతేడాది జూలైలో నోటిఫికేషన్ ఇస్తారని ప్రభుత్వం ప్రకటించడంతో కోచింగ్ కూడా తీసుకున్నాను. టెట్‌కు హాజరయ్యాను. నోటిఫికేషన్‌పై అభ్యర్థులంతా ఆశలు పెట్టుకుని చూస్తున్నారు. త్వరగా నోటిఫికేషన్ జారీ చేయాలి.

– పి.శశికళ, కోట, కె.గంగవరం మండలం

వాయిదాలు పడుతున్నాయి



డీఎడ్, బీఎడ్ కూడా పూర్తి చేశాను. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని ప్రభుత్వం ప్రకటించగానే ప్రైవేట్‌గా చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి కోచింగ్‌కు వెళ్లాను. వేలాది రూపాయలు వెచ్చించి, కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఆరు నెలల పాటు కోచింగ్ తీసుకున్నాను. త్వరగా నోటిఫికేషన్ ఇస్తే నిరుద్యోగులకు ఉపయోగంగా ఉంటుంది.

– టి. వెంకటసాయి హర్షిక, వెదురుపాక, రాయవరం మండలం.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో సెంట్రల్ డీజీ చంద్రశేఖర్



అంతర్వేది ఆలయంలో డీజీ చంద్రశేఖర్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం సెంట్రల్ డీజీ ఆజాద్ చంద్రశేఖర్ (ఐపీఎస్), కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

యూపీ వ్యక్తిని కాపాడిన మెరైన్ పోలీసులు



వికాష్ పాండేను కాపాడి ఒడ్డుకు తీసుకువస్తున్న మెరైన్ పోలీసులు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో పండగ పూట ఒక నిండు ప్రాణాన్ని మెరైన్ పోలీసులు కాపాడారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఆల్‌టెక్ పనులు నిమిత్తం వలస వచ్చిన వికాష్ పాండే బీచ్‌కు వచ్చి సముద్ర స్నానం చేస్తూ మునిగిపోయాడు. స్థానికుల అరుపులతో ఒడ్డున ఉన్న మెరైన్ కానిస్టేబుల్ గంగాధర్ సముద్రంలోకి దిగి కాపాడారు. ఎస్సై సురేష్, హెచ్‌సీ వెంకటేశ్వర్లు, పీసీ ప్రసాద్ సాయం చేశారు. గంగాధర్‌ను మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

ఎల్.గన్నవరంలో కారు దగ్ధం



ఎల్.గన్నవరంలో దగ్ధమైన కారు

పి.గన్నవరం: మండలంలోని ఎల్.గన్నవరం గ్రామంలో మంగళవారం ఒక కారు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు భావిస్తున్నారు. అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన కర్రా శ్రీనివాస్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వచ్చారు. మంగళవారం ఉదయం అంబాజీపేటకు వెళ్లి అక్కడ నుంచి కారులో పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం గ్రామంలోని డొక్కా సీతమ్మ వారి నివాసాన్ని తిలకించేందుకు వచ్చారు. రోడ్డు పక్కన కారును పార్క్ చేశారు. సీతమ్మ ఇంటిని తిలకించి తిరిగి వస్తుండగా, ఇంజన్ భాగంలో మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పి వేశారు. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

వాలీబాల్ విజేత నడకుదురు



నడకుదురు జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న తోట రాజు, శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా తాళ్లరేవులో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఘనంగా ముగిశాయి. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా గల స్థలంలో నాకౌట్ పద్ధతిలో డే అండ్ నైట్, ఫ్లడ్ లైట్ల కాంతుల్లో ఈ పోటీలను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. 24 జట్లు తలపడగా భైరవపాలెం, నడకుదురు జట్లు ఫైనల్‌కు చేరాయి, హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో నడకుదురు జట్టు విజయం సాధించింది. కాగా గిరియాంపేట జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేత జట్టుకు సుంకరపాలెం హోండా షోరూం అధినేత తోట రాజు, ముమ్మిడివరం ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ బహుమతి ప్రదానం చేశారు.

శంకరగుప్తంలో చెడుగుడు పోటీలు

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం గ్రామంలో నల్లివారిపేటలో 71 సంవత్సరాలుగా జరుగుతున్న చెడుగుడి ఆటల పోటీలు సంక్రాంతి సందర్భంగా నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ కబడ్డీ పోటీలను బుధవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. విజేతలు ప్రథమ బహుమతిగా క్రాంతి బ్రదర్స్ బాయ్స్ (శంకర్‌గుప్తం) రూ.20వేలు, జ్ఞాపిక. ద్వితీయ బహుమతి పసక్ బాయ్స్ (శృంగవరప్పాడు) రూ.15 వేలు, జ్ఞాపిక. తృతీయ బహుమతి ప్లే బాయ్స్(పడమటిపాలెం) రూ.ఏడు వేలు, జ్ఞాపిక అందుకున్నారు. నైపుణ్యం చూపిన వారికి బెస్ట్ ప్లేయర్ జ్ఞాపికలను ఎమ్మెల్యే, స్థానిక సర్పంచ్ రాపాక ఆనందకుమార్ చేతుల మీదుగా అందించారు.

విభిన్నంగా పొట్టేళ్లు



చిల్లంగిలో పందుల పోటీలు



చిల్లంగిలో తలపడుతున్న పొట్టేళ్లు

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి వద్ద పొలాల్లో పందుల, పొట్టేళ్ల పోటీలు నిర్వహించడం గమనార్హం . సాధారణంగా కోడి పందేలు చూస్తుంటాం. ఇక్కడ కాస్త విభిన్నంగా ఈ పోటీలు నిర్వహించారు. మూగ జీవాలను పోటీల పేరుతో ఇలా హింసించడం తగదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిపూర్ణానంద స్వామికి మాతృ వియోగం



పరిపూర్ణానంద స్వామి మాతృమూర్తి మీనాక్షి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద సరస్వతి స్వామి మాతృ వియోగం పొందారు. ఆయన మాతృమూర్తి, పూర్వాశ్రమ తల్లి టీజీ మీనాక్షి(80) భోగి రోజున సోమవారం పరమ పదించారు. ఈ మేరకు శ్రీపీఠం నిర్వాహకులు బుధవారం తెలియజేశారు. పిఠాపురం పాదగయ వద్ద శ్మశాన వాటికలో మంగళవారం పరిపూర్ణానంద స్వామి చేతుల మీదుగా అంత్య క్రియలు నిర్వహించారు. నెల్లూరులో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తుండగా మీనాక్షి రెండు కళ్లకు రెటీనా దెబ్బతినడంతో కంటి చూపు పూర్తిగా పోయింది. తల్లిదండ్రులు, తోబుట్టువులు ఒత్తిడితో బాలచంద్రన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు. తనకు పుట్టే సంతానం సన్యాసిగా జాతికి సేవ చేయాలని ఆమె సంకల్పించుకున్నారు. 1972 నవంబర్ 1న బిడ్డ పుట్టగా గురువుల సన్నిధిలో పెంచారు. పదునాలుగున్నర ఏళ్ల వయసులో హృషికేష్‌లో గంగాతీరంలో దయానంద ఆశ్రమంలో స్వామి దయానంద వద్దకు చేర్చారు. అప్పటి నుంచి 36 ఏళ్లు ఆమె ఒక దీక్ష తీసుకుని బంగార ఆభరణాలు, వస్త్రాలంకరణ లేకుండా తన బిడ్డపైనే ఆశలు పెట్టుకుని సన్యాసిగా తీర్చిదిద్దారు. ఆయనే కాకినాడ శ్రీపీఠం వ్యవస్థాపకుడు పరిపూర్ణా నంద సరస్వతి. రెండో సంకల్పంగా నిత్యం సహస్ర గాయత్రి చేస్తూ కోటి 14లక్షల గాయత్రి జపాన్ని పూర్తి చేశారు. మూడో సంకల్పంగా తన బిడ్డ చేతుల్లో తుదిశ్వాస విడిచారు. పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ 72రోజుల పాటు వైద్య అంశాలకు అతీతంగా దివ్యమైన అమ్మవారి సన్నిధిలో గడిపి భోగి నాడు తుదిశ్వాస విడిచారన్నారు. సంక్రాంతి రోజున అంత్యక్రియలు, కనుమ నాడు గోదావరిలో అస్థికల నిమజ్జనం చేశామని తెలియజేశారు.

తండ్రీకొడుకులను కొట్టిన వ్యక్తులపై కేసు

కొవ్వూరు: మోటారు సైకిల్ పై పొలం వెళుతున్న తండ్రీకొడుకులను కొట్టడమేకాక, చంపుతానని బెదిరించినట్లు అందిన ఫిర్యాదుపై సీతంపేట గ్రామానికి చెందిన కొందరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. సీతంపేటకు చెందిన సంగీతం చిన్నరాజు, తన కుమారుడు కిరణ్ విష్ణుష్ మోటారు సైకిల్‌పై పొలం బయల్దేరారు. మార్గమధ్యలో గొడవ పడుతున్న వ్యక్తులను చిన్నరాజు వారించారు. దీంతో మచ్చా వెంకటరమణ, అల్లం సంజు, కొత్తపల్లి ప్రసన్నకుమార్‌తో పాటు మరికొంత మంది మోటారుసైకిల్‌ను అడ్డుకుని తిరగబడి చిన్నరాజును పిడిగుద్దులు గుద్ది చంపుతానని బెదిరించారు. ప్రశ్నించినందుకు కిరణ్ విష్ణుష్‌ను సైతం కొట్టి దుర్భాషలాడి చంపుతానని బెదిరించారు. వెంకటరమణ అనే వ్యక్తి చిన్నరాజుపై బీరు బాటిల్‌తో దాడి చేసినట్లు పేర్కొన్నారు. చిన్నరాజు కుమారుడు కామేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు. తన తండ్రి చిన్నరాజు, తమ్ముడు కిరణ్ విష్ణుష్ ప్రస్తుతం నిడదవోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు.

కొత్త అల్లుడికి 270 రకాలతో విందు



నగరంలో కొత్త అల్లుడికి ఏర్పాటు చేసిన మెగా విందు

మామిడికుదురు: సంక్రాంతి పండుగకు కొత్త అల్లుడికి మెగా విందు ఏర్పాటు చేసి ఔరా అనిపించారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన కుక్కల వెంకటేశ్వరరావు. ఆయన కుమార్తె మౌనికకు మూడు నెలల క్రితం మామిడికుదురుకు చెందిన శ్రీరామ్‌తో వివాహమైంది. సంక్రాంతి పండుగకు కొత్త అల్లుడిని ఇంటికి తీసుకు వచ్చి, 270 రకాల పిండి వంటలతో మెగా విందు ఏర్పాటు చేశారు. వెజ్, నాన్ వెజ్‌తో కూడిన పలు రకాల వంటకాలతో ఏర్పాటు చేసిన ఈ విందు అబ్బురపరచింది.

39 ప్రైవేట్ బస్సులకు 1,24,575 అపరాధ రుసుం

రావులపాలెం: నింబంధనలు పాటించని 39 ప్రైవేట్ బస్సులకు రూ.1,24,575 అపరాధ రుసుం విధించినట్టు జిల్లా రవాణాధికారి డి. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రైవేట్ బస్సులను తెల్లవారుజామున ఈతకోట వద్ద హైవేపై ఆర్.టి.ఏ అధికారులు తనిఖీలు చేశారన్నారు. 39 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.1,24,575 అపరాధరుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వాహనాల తనిఖీ అధికారులు రాజేంద్ర ప్రసాద్, రవికుమార్, లక్ష్మీ శ్రీదేవి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారన్నారు.

హిందుత్వ ప్రాచుర్యానికి కృషి

- దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా 8,600 భక్తి మండళ్ల ఏర్పాటు
- డైరెక్టర్ ఆనంద తీర్థాచార్యులు వెల్లడి

ఆలమూరు: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన శ్రీతిరుపతి తిరుమల దేవస్థానం అనుబంధ సంస్థ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా పురందరదాసు కీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడంతో పాటు హిందుత్వానికి ప్రాచుర్యం కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని డైరెక్టర్ పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాస సాహిత్య ప్రాజెక్టు పర్యవేక్షణలో సుమారు 8,600 మహిళ భక్తి మండళ్లను ఏర్పాటు చేశామన్నారు. అందులో 4,500 గ్రూపులు చురుగ్గా పని చేస్తూ టీటీడీ చేపడుతున్న భక్తి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళుతున్నాయన్నారు. భజన మండళ్ల ఏర్పాటుకు విశేష స్పందన వస్తున్నందున త్వరలోనే ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చి మరిన్ని మండళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అందులో భాగంగానే వెబ్‌సైట్ నిర్వహించనున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందన్నారు. పురందరదాసు 4.75 లక్షల సంకీర్తనలు రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 47ఏళ్ల క్రితం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందరదాసు కీర్తనల సారాంశాన్ని వివరించి మండలి సభ్యులకు నేర్పిస్తామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించే విధంగా బాలికలకు దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా శిక్షణను ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

కోలాట శిక్షణ కోసం బడ్జెట్ కేటాయింపు

గ్రామీణ ప్రాంతాల్లో కోలాటానికి మరింత ప్రాచుర్యం కల్పించే విధంగా బాలికలకు శిక్షణ కోసం టీటీడీ గత ఏడాది రూ.2.30 కోట్ల బడ్జెట్ కేటాయించిందని దాస సాహిత్య ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద తీర్థాచార్యులు తెలిపారు. దక్షిణ భారతదేశంలో మరిన్ని భజన మండళ్లు ఏర్పాటు చేసి టీటీడీ ధార్మిక వ్యవస్థకు మరింత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద తీర్థాచార్యులు దంపతులు అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాస సాహిత్య ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ పాల్గొన్నారు.

అన్నవరం కొండపై మహిళ ఆత్మహత్యాయత్నం

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

అన్నవరం: కుటుంబ కలహాల కారణంగా కాకినాడకు చెందిన ఒక మహిళ అన్నవరంలో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్టుగా సమాచారం అందుకున్న పోలీసులు ఆ మహిళ ఆచూకీ తెలుసుకుని ఆమెను బంధువులకు అప్పగించారు. బుధవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కాకినాడలోని జగన్నాథపురానికి చెందిన తోలం లక్ష్మి కుటుంబ కలహాల కారణంగా మంగళవారం సాయంత్రం అన్నవరం కొండ మీదకు ఆత్మహత్య చేసుకొనేందుకు వచ్చింది. విజయవాడ డీజీపీ కార్యాలయం నుంచి 112 నంబర్ కాల్ ద్వారా కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఈ సమాచారం రావడంతో ఆయన స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. స్థానిక పోలీసులు అన్నవరం కొండపై గాలించి 40 నిమిషాల వ్యవధిలోనే ఆ మహిళ ఆచూకీ కనుగొని ఆమె కు కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులను పిలిపించి వారికి ఆమెను అప్పగించినట్లు అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు తెలిపారు.

జనంలోకి దూసుకొచ్చిన రెండెడ్ల బండి

అంబాజీపేట: మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థానికి కొంతమంది ప్రత్యేకంగా అలంకరించిన రెండ్లెడ్ల బండిపై వస్తూ ఉంటారు. గంగలకుర్రు నుంచి రెండెడ్ల బండిపై జగ్గన్నతోట తీర్థానికి వస్తున్న సమయంలో అక్కడ ఉన్న జనాలు, బూరలు ఊదడంతో ఎడ్లు భయపడి జనాల్లోకి దూసుకువచ్చాయి. దీంతో తీర్థానికి వచ్చిన నలుగురు భక్తులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అక్కడ ఉన్న జనం ఎద్దులను కట్టడి చేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు, భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

ప్రత్తిపాడు: స్థానికంగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన మొగ్గా అభిషేక్ (12) తన స్నేహితుడితో కలిసి బైక్‌పై ప్రత్తిపాడు వస్తున్నాడు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన రాసూరి మహేష్‌కుమార్, కన్నూరి దుర్గాప్రసాద్ బైక్‌పై కిర్లంపూడి వైపు వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌లు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఢీకొనడంతో మొగ్గా అభిషేక్ (12) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన మహేష్‌కుమార్, దుర్గాప్రసాద్‌ను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ కాలువలోకి దూసుకుపోయి..

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయిన ఘటనలో గండి వీరభద్రరావు(45) మృతి చెందినట్టు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన వీరభద్రరావు జి.వేమవరంలోని రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్న సమయంలో చెరువుల వద్ద నుంచి ఇంటికి బైక్‌పై వెళుతుండగా స్థానిక ఆశ్రమం వద్ద బైక్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో వీరభద్రరావు మట్టిలో కూరుకుపోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయ రహదారిపై 120 చక్రాల బండి



రాజానగరం: జాతీయ రహదారిపై వెళ్తున్న 120 చక్రాలతో కూడిన భారీ వాహనం అందరినీ ఆకట్టుకుంది. చెన్నై నుంచి రెండు రోజుల క్రితం బయలుదేరిన ఈ వాహనం ఒడిశాలోని డార్సెల్ ఫ్యాక్టరీకి వెళుతోంది. ఈ ప్రయాణంలో విశ్రాంతి తీసుకునే క్రమంలో వాహనాన్ని చోదకుడు దివాన్‌చెరువులో రోడ్డు పక్కన కొద్దిసేపు ఆపాడు. సుదూరం కావడం వలన ఈ వాహనంలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు సహాయకులు షిఫ్టుల ప్రకారం డ్యూటీ చేస్తున్నారు. రోడ్డు పక్కన ఆగిన వాహనాన్ని కొందరు ప్రయాణికులు తమ సెల్‌ఫోన్లలో క్లిక్ మనిపిస్తే, మరికొందరు సెల్ఫీలు దిగారు.

← భారీ వాహనం